తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 15 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 161 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

గిగ్ వర్కర్లకు

5 లక్షల జీవిత బీమా..

అమల్లోకి కొత్త చట్టం

గిగ్ వర్కర్ల సంక్షేమ విధానం ఆవిష్కరణ

రాహుల్ గాంధీతో కలిసి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

రూ.10 లక్షల ఆరోగ్య భద్రత కల్పిస్తున్నట్లు ప్రకటన

ప్రత్యేక గుర్తింపు కార్డులు, సంక్షేమ బోర్డు ఏర్పాటు



హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమం కోసం రూపొందించిన నూతన విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆవిష్కరించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని జయభేరీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల నమోదుకు సంబంధించిన ఆన్‌లైన్ విధానాన్ని ప్రారంభించారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల నిబంధనలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి సంబంధించిన చట్టాన్ని కార్మికులకు అంకితం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు శిల్పారామం నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు నిర్వహించిన భారీ ద్విచక్ర వాహన ర్యాలీలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పాల్గొన్నారు. గిగ్ వర్కర్ల ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ వారితో కలిసి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల చట్టాన్ని ప్రజలకు అంకితం చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మిగతా 2 లో..

ఇచ్చిన హామీని

నిలబెట్టుకున్నాం

గిగ్ కార్మికుల కష్టాలు, సమస్యలు నాకు తెలుసు : రాహుల్ గాంధీ



కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

విశ్రాంతి కేంద్రాలు, బీమా, పింఛను సదుపాయాలు

ప్రతి డెలివరీపై ఒక శాతం నిధులు కార్మికుల ఖాతాలకు

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):

గిగ్ కార్మికుల సమస్యలు, వారి కష్టాలు తనకు తెలుసని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కార్మికుల శ్రమను గుర్తించి వారికి అండగా నిలుస్తామని గతంలో తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. గిగ్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన వారిని ఆప్యాయంగా పలుకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల కష్టాలను గుర్తించడమే కాకుండా, వారి జీవితాల్లో భద్రత, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. దేశంలో ఇప్పటివరకు గిగ్ కార్మికులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక డెలివరీకి ఎంత సమయం పడుతోంది, దానికి కార్మికుడికి ఎంత పారితోషికం లభిస్తోంది అనే వివరాలు కూడా స్పష్టంగా తెలియని పరిస్థితి ఉందన్నారు. పని చేస్తున్నది కార్మికులే అయినప్పటికీ, వారి శ్రమకు సంబంధించిన సమాచారం వారి చేతుల్లో ఉండటం లేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలను కార్మికులకు తెలియజేస్తోందని చెప్పారు. వారి శ్రమకు తగిన గుర్తింపు, పారితోషికం అందేలా చర్యలు చేపడుతోందని వివరించారు.

మిగతా 2 లో..



ప్రజల ఆకాంక్షల కోసం ప్రపంచ ప్రజాస్వామికవాదులంతా ఏకం కావాలి

- ప్రజల కలలను సాకారం చేయడమే లక్ష్యంగా పోరాటం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు సమష్టి కృషి అవసరం
- సంపన్నుల కోసం కాదు.. సామాన్యుల కోసం ప్రభుత్వాలు పనిచేయాలి
- భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రజాస్వామికవాదులంతా ఏకమై కలిసికట్టుగా పోరాటం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వారి కలలను సాకారం చేయడానికి అందరూ చేతులు కలపాలని కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో రెండు రోజుల పాటు నిర్వహించిన భారత్ సమ్మిట్ 2026 ముగింపు సమావేశంలో 'ప్రపంచ న్యాయం సాధన' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఒకే ఆలోచనా ధోరణి కలిగిన ప్రతినిధులు, ప్రభావశీల వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో భారత్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనుకునే శక్తులకు, దానిని బలహీనపరచాలని ప్రయత్నించే శక్తులకు మధ్య పోరాటం జరుగుతోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఒకవైపు రాజ్యాంగం, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలని కొందరు ప్రయత్నిస్తుంటే, మరోవైపు నియంతృత్వ ధోరణులను రుద్దాలని మరికొందరు చూస్తున్నారని విమర్శించారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని ప్రజాస్వామికవాదులు కోరుకుంటుంటే, కొన్ని వర్గాలకే ఆ హక్కు పరిమితం చేయాలని నియంతృత్వ శక్తులు భావిస్తున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల హక్కుల రక్షణ కోసం తాము పనిచేస్తుంటే, మరోవైపు పర్యావరణ విధ్వంసానికి, అధికార కేంద్రీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు సంపన్నుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడంతో పాటు అధికారాన్ని కొందరి చేతుల్లో కేంద్రీకరించకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని సూచించారు. ఏకపార్టీ, ఏకవ్యక్తి పాలనకు వ్యతిరేకంగా చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే తమ ఆలోచనా విధానమని తెలిపారు. గొప్ప లక్ష్యం కోసం కలిసికట్టుగా పోరాడితే ఎలాంటి శక్తులూ ప్రజాస్వామిక ఉద్యమాలను అడ్డుకోలేవని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ ప్రభావాలు, కరోనా మహమ్మారి అనంతర పరిణామాల కారణంగా ప్రపంచంలోని అనేక దేశాలు దాదాపు ఒకే రకమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులపై దాడులు, విద్య, ఉపాధి, వైద్య సేవలు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు ప్రజలను ఇబ్బందులకు

మిగతా 2 లో..

మూడు బడ్జెట్లు దాటినా హామీల అమలేది?

- రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు సూటి ప్రశ్నలు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులపై నిలదీత
- రాజీవ్ యువ వికాసం కాగితాలకే పరిమితమైందని విమర్శ
- రేవంత్ ప్రభుత్వాన్ని లెక్క అడగాలని డిమాండ్

2 లో..



భారత్ సమ్మిట్ విజయవంతం.. వివిధ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యం

- మంత్రి శ్రీధర్‌బాబు
- ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రాహుల్ గాంధీ
- హెచ్‌ఐసీసీలో 12 అంతర్జాతీయ చర్చా కార్యక్రమాలు
- హైటెక్స్‌లో తెలంగాణ రైజింగ్‌పై 8 ప్రత్యేక సమావేశాలు ప్రపంచ సమస్యలపై భిన్న అభిప్రాయాలు, ఆలోచనల మార్పిడి

2 లో..



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

గిగ్ వర్కర్లకు 5 లక్షల జీవిత బీమా..

(మొదటి పేజీ తరువాయి)

ఈ చట్టం అదే రోజు నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. దీని ద్వారా ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆరోగ్య భద్రతలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కార్మికుడికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించనున్నట్లు చెప్పారు. ఈ విధానం ద్వారా గిగ్, ప్లాట్‌ఫామ్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి వారి సంక్షేమానికి అవసరమైన



చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల కోసం చట్టం రూపొందించే ప్రక్రియలో ఐఐటీ వంటి విద్యాసంస్థలతో పాటు సామాజిక కార్యకర్త నిఖిల్ సహకారం అందించారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా వారు ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని చెప్పారు. గిగ్ వర్కర్ల నాయకులు, వివిధ రంగాల నిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం కార్మికుల అవసరాలకు అనుగుణంగా చట్టాన్ని రూపొందించినట్లు వివరించారు. విధుల్లో ఉండగా ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు గిగ్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం





(మొదటి పేజీ తరువాయి)

ఎండలోనూ, వర్షంలోనూ నగరాల వీధుల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ డెలివరీలు చేసే కార్మికులకు విశ్రాంతి తీసుకునేందుకు గతంలో తగిన వసతులు లేవని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర నగరాల్లో ప్రభుత్వం విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. గిగ్ కార్మికులకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య సహాయం, ప్రమాదాల సమయంలో బీమా రక్షణ కల్పించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాలతో పాటు పింఛను, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.ప్రతి డెలివరీ, ప్రతి రవాణా లావాదేవీకి సంబంధించిన మొత్తంలో ఒక శాతం నిధులు గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డుకు చేరే విధానం అమలు చేస్తున్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఆ నిధులు బోర్డు ద్వారా కార్మికుల ఖాతాలకు చేరుతాయని చెప్పారు.కార్మికులకు ప్రతి డెలివరీలో వాటా లభించడంతో పాటు విశ్రాంతి, ఆరోగ్య రక్షణ, కుటుంబ సంక్షేమానికి అవసరమైన సదుపాయాలు అందాలన్నదే తమ ఆలోచన అని తెలిపారు. కార్మికుల హక్కులు, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.దేశంలో కార్మికుల విషయంలో రెండు భిన్నమైన ఆలోచనా విధానాలు ఉన్నాయని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానం కార్మికులతో ఎక్కువ సమయం పనిచేయించుకుని వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకుండా చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ విధానం మాత్రం గిగ్ కార్మికులను దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించి, వారికి రక్షణ కల్పించడమేనని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం గిగ్ కార్మికులకు అండగా ఉంటాయని, వారి పిల్లల విద్య, కుటుంబ ఆరోగ్య భద్రతకు తోడ్పాటు అందిస్తాయని భరోసా ఇచ్చారు. కార్మికులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని పేర్కొంటూ జై హింద్, జై తెలంగాణ నినాదాలతో ప్రసంగాన్ని ముగించారు.

ప్రజల ఆకాంక్షల కోసం ప్రపంచ ప్రజాస్వామికవాదులంతా ఏకం కావాలి


(మొదటి పేజీ తరువాయి)

గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ దేశాల్లో ప్రజల కలలు, ఆకాంక్షలు కూడా ఒకే విధంగా ఉన్నాయని అన్నారు. తమ సమస్యలను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలని, తమ మాట వినాలని, తమ ఆశయాలను నెరవేర్చాలని లక్షలాది మంది ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజల తరఫున నిలబడాల్సిన బాధ్యత ప్రజాస్వామికవాదులపై ఉందని, సంపన్నుల ప్రయోజనాల కంటే సామాన్యుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉద్ఘాటించారు.ఈ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం కొందరికి వీసాలు నిరాకరించిందని తన ప్రసంగంలో ప్రస్తావించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్నారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ఈ సదస్సు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుందని పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నెహ్రూ దార్శనికత దోహదపడిందని గుర్తుచేశారు.ప్రపంచ ప్రజల ఆకాంక్షలు,ప్రజాస్వామ్య విలువలు,సమాన హక్కుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ స్థాయిలో ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కవిత పార్టీ కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థ: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- **తెలంగాణ రక్షణ సేనపై తీవ్ర విమర్శలు**
- **కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులే లక్ష్యంగా ఆరోపణ**
- **రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని విమర్శ**
- **కాంగ్రెస్‌కు అనుబంధంగా పనిచేస్తోందని వ్యాఖ్య**

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కవిత పార్టీ కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థగా పనిచేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సింది పోయి, బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడమే ఆమె పనిగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత



హరీశ్ రావులను ఉద్దేశించి కవిత విమర్శలు చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ అన్నారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయంలో ప్రతిపక్ష నాయకత్వంపై విమర్శలు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.కవిత రాజకీయ వైఖరిపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు వంటి అంశాలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కవిత మాత్రం బీఆర్ఎస్ నాయకత్వంపైనే విమర్శలు కేంద్రీకరిస్తున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ రక్షణ సేన కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థగా వ్యవహరిస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆ పార్టీ రేవంత్ రెడ్డి సైన్యంలా పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చే విధంగా కవిత వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కవిత పార్టీని కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థగా అభివర్ణిస్తూ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ నాయకత్వంపై కవిత చేస్తున్న విమర్శలు, వాటిపై ఇతర నేతలు స్పందిస్తున్న తీరు రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ వాదోపవాదాలకు దారితీస్తోంది.

మూడు బడ్జెట్లు దాటినా హామీల అమలేది?

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. పథకాలకు దివంగత మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల పేర్లు పెట్టినంత మాత్రాన వారికి గౌరవం ఇచ్చినట్లు కాదని, వారి పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్యానించారు. అమలుకు నోచుకోని పథకాలకు మహనీయుల పేర్లు పెట్టి ప్రజలను మోసం చేయడం వారిని అవమానించడమేనని విమర్శించారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై సమీక్ష నిర్వహించాలని హరీశ్ రావు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్లలో చేసిన కేటాయింపులు,ప్రకటించిన హామీల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ ఎందుకు అమలు కాలేదో ముఖ్యమంత్రిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్ల విధానం హామీలు ప్రకటించడం, గతంలో ప్రకటించిన వాటినే మళ్లీ కొత్త బడ్జెట్‌లో ప్రస్తావించడం, చివరకు నిధులు విడుదల చేయకుండా వదిలేయడంగా ఉందని హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్ ప్రసంగాల్లో భారీ మొత్తాలు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని 202425 బడ్జెట్‌లో ప్రకటించారని గుర్తుచేశారు. 202526 బడ్జెట్‌లోనూ ఈ పథకం అమలుపై ప్రకటనలు చేసినప్పటికీ అర్హులైన కూలీలకు నేటికీ సాయం అందలేదని విమర్శించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు 202526 బడ్జెట్‌లో ప్రకటించారని, 202627 బడ్జెట్‌లోనూ అదే మొత్తాన్ని ప్రస్తావించారని తెలిపారు. అయితే నిధుల విడుదల, పథకం అమలు విషయంలో స్పష్టత లేదని ప్రశ్నించారు. మూడు బడ్జెట్లు గడిచినా పాత హామీలే మళ్లీ వినిపిస్తున్నాయని, ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాజకీయ నినాదాలు, ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాహుల్ గాంధీని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్లపై తక్షణమే సమీక్ష జరిపి, అమలుకాని హామీలపై ముఖ్యమంత్రిని నిలదీయాలని సూచించారు. తెలంగాణ ప్రజలకు కావాల్సింది రాజకీయ జిమ్మిక్కులు కాదని, సుపరిపాలన, హామీల అమలేనని హరీశ్ రావు స్పష్టం చేశారు.

భారత్ సమ్మిట్ విజయవంతం.. వివిధ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యం

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్-2026 విజయవంతంగా ముగిసిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హెచ్ఐసీసీలో శనివారం జరిగిన ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమ్మిట్ నిర్వహణలో వివిధ దేశాల ప్రతినిధులు, మేధావులు, నిపుణులు భాగస్వాములు కావడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం ఉన్న అంశాలపై విస్తృతంగా చర్చించేందుకు హైదరాబాద్ అంతర్జాతీయ వేదికగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



భారత్ సమ్మిట్‌లో భాగంగా హెచ్ఐసీసీలో 12 అంతర్జాతీయ చర్చా కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు. అదేవిధంగా హైటెక్స్‌లో తెలంగాణ రైజింగ్ అంశంపై 8 ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, మేధావులు, నిపుణులు ఈ సమావేశాల్లో పాల్గొని తమ అనుభవాలను, అభిప్రాయాలను పంచుకున్నారని వివరించారు. విభిన్న దేశాలు, రంగాలకు చెందిన వ్యక్తులు ఒకే వేదికపై సమావేశమై ప్రపంచ సమస్యలపై చర్చించడం సమ్మిట్‌లో ప్రత్యేకతగా నిలిచిందన్నారు. అంతర్జాతీయ స్థాయి చర్చలతో పాటు తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలకూ ఈ వేదిక ప్రాధాన్యం కల్పించిందని పేర్కొన్నారు.

కృత్రిమ మేధ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ శాంతి, ప్రజాస్వామ్యం, భవిష్యత్తులో మీడియా రంగంలో రానున్న మార్పులపై సమ్మిట్‌లో చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, పర్యావరణ పరిరక్షణకు ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారని చెప్పారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రపంచ శాంతి, మీడియా భవిష్యత్తుపై భిన్నమైన ఆలోచనలు, సూచనలు వెలువడ్డాయని వివరించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా కీలక అంశాలపై విస్తృత అవగాహనకు అవకాశం ఏర్పడిందన్నారు.

తెలంగాణ రైజింగ్ ప్రత్యేక సమావేశాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను అంతర్జాతీయ వేదికపై చర్చించే అవకాశం లభించిందని శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు, మేధావులు, నిపుణులతో అభిప్రాయాల మార్పిడి జరగడం రాష్ట్రానికి ఉపయోగకరమన్నారు. అంతర్జాతీయ అనుభవాలు, కొత్త ఆలోచనలను తెలుసుకోవడంతో పాటు తెలంగాణ అభివృద్ధి దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధుల నుంచి వచ్చిన విభిన్న సూచనలు, అభిప్రాయాలు భవిష్యత్తులో మరిన్ని చర్చలకు దోహదపడతాయని తెలిపారు.

భారత్ సమ్మిట్-2026 విజయవంతం కావడానికి సహకరించిన వక్తలు,ప్రతినిధులు,పాల్గొన్నవారు,నిర్వాహకులకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం కోసం శ్రమించిన ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి చర్చలకు హైదరాబాద్ వేదిక కావడం, వివిధ దేశాల ప్రతినిధులు ఒకచోట చేరి ప్రపంచ సమస్యలపై చర్చించడం సంతోషకరమన్నారు. ముగింపు సమావేశానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మిట్ ద్వారా ఏర్పడిన అంతర్జాతీయ సంబంధాలు, ఆలోచనల మార్పిడి భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 15 - నవంబర్ 2026
వరంగల్ 03

బీజేపీ చిల్పూర్ మండల నాయకుల ముందస్తు అరెస్టు

- **నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలి**



హనుమకొండ, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ చిల్పూర్ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అటువంటి ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. నిరసన తెలిపే హక్కును హరించేలా ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా పోలీసులు నిర్బంధించిన బీజేపీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, జిల్లా నాయకుడు బాల్నే శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాలని కోరారు.



ఫాదర్ కొలంబో పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- **విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి**

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఫాదర్ కొలంబో పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, ఇతర కళారూపాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఫాదర్ థామస్ కిరణ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికితీసి, ప్రతిభను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు.
ఈ వేడుకల్లో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల ఆనందం, అభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే పాఠశాల ప్రధాన లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది.

బాలల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలి



- **పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్**

పెద్దమందడి,నవంబర్14(తెలంగాణ ముచ్చట్లు): దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి బాలల దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. బాలలే భావి భారత పౌరులని, వారి అభ్యున్నతికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బాల్యంలోనే మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిన్నారులను ఎంతో ప్రేమించేవారని, వారి భవిష్యత్తు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు.పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ, వారి విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే నెహ్రూ ఆశయాలకు నిజమైన గౌరవమని తహసీల్దార్ మల్లికార్జున్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, కాంగ్రెస్ నాయకులు వడ్డే శేఖర్, చందు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.





క్రీడలతోనే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం

- **అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలల వేదికగా నిర్వహిస్తున్న అండర్ 17 బాలబాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా క్రీడాకారులు, కోచ్‌లతో కలిసి బాస్కెట్‌బాల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మేయర్ స్వయంగా బాస్కెట్‌బాల్‌ను కోర్టులో వేసి పోటీలను ప్రారంభించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. అనంతరం పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో మాట్లాడారు.
క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమిష్టి భావనను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల హామీ

- **ఐదుగురు డీఎంహెచ్‌ఓలతో కమిటీ ఏర్పాటు**
- **ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జిల్లా ఎన్‌హెచ్‌ఎం వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా హుస్సేన్**

వనపర్తి,నవంబర్14(తెలంగాణ ముచ్చట్లు): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంపై వనపర్తి జిల్లా ఎన్‌హెచ్‌ఎం వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తాత్కాలికంగా తమ ఆందోళన కార్యక్రమాలను విరమించుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పర్యటించి ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారుల వివరాలు, అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ పరిస్థితులు, నివాస వివరాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నాయా లేదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండో విడతలో 22 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అందేలా క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించి పరిశీలించారు. ఇళ్ల మంజూరు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు .ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు వడ్డే శేఖర్, గుండెల ఆంజనేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు క్షేత్రస్థాయి పరిశీలన

- **లబ్ధిదారుల అర్హతలను పరిశీలించిన తహసీల్దార్ మల్లికార్జున్**



నెహ్రూ ఆశయాలతోనే నవభారత నిర్మాణం

- **పామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం**

పెద్దమందడి,నవంబర్14(తెలంగాణ ముచ్చట్లు): దేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహానేత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం మాట్లాడుతూ.. విద్య, విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదులే నేటి భారత ప్రగతికి బాటలు వేశాయని పేర్కొన్నారు. నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారిలోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత, నూతన ఆలోచనలు దాగి ఉంటాయని నెహ్రూ విశ్వసించేవారని గుర్తుచేశారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పిల్లలకు భయంలేని బాల్యం, వివక్ష కు తావులేని వాతావరణం, నాణ్యమైన విద్య అందించినప్పుడే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు.ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పిస్తూ, విలువలతో కూడిన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు మనం అందించే నిజమైన నివాళి అని సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములమ్మ అనుమంతు, వార్డు సభ్యులు శంకర్, సీఆర్‌పీ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్త సునీత, ఆశా కార్యకర్తలు లక్ష్మి, హేమలత, మహిళా సంఘం వీఓ శారదతో పాటు గ్రామంలోని బాలబాలికలు పాల్గొన్నారు.



బ్రెయినీ స్టార్స్ మాంటిస్సోరి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ఖమ్మం బ్యూరో , నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మంలోని వీడీఓస్ కాలనీ, గట్టయ్య సెంటర్‌లో ఉన్న బ్రెయినీ స్టార్స్ మాంటిస్సోరి పాఠశాలలో నవంబర్ 14న బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జైనుల్ పాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాలల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారికి పిల్లలంటే ఎంతో ఇష్టమని, ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు.
పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, మంచి నడవడిక, సమయపాలన, కష్టపడి చదివే అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మకత, నైతిక విలువలు, సేవాభావం వంటి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు ప్రోత్సాహాన్నిచ్చారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపల్‌కు జమాతే ఇస్లామీ హింద్ మహిళల అభినందన



ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందుకున్న మైనారిటీ గురుకుల పాఠశాల2 ప్రిన్సిపల్ పి. సీతామహాలక్ష్మిని జమాతే ఇస్లామీ హింద్ మహిళా సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం పీఆర్ కన్వీనర్ హాజిరా సదఫ్, సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం, పీఆర్ సభ్యులు జహెరా ఫాతిమా, ఫైజా ఇరం,షబానా తదితరులు ప్రిన్సిపల్ సీతామహాలక్ష్మికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందించారు.

అనంతరం హాజిరా సదఫ్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం, వారి సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రిన్సిపల్ చేసిన విశేష కృషికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిస్తూ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ అవార్డు ఆమె అంకితభావానికి, నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిల, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ అనిత ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు జమాతే ఇస్లామీ హింద్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

రౌడీ గ్యాంగ్ పేరుతో పోస్టులు..



- **ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన తెల్లపొట్ట మురళి కృష్ణ అనే వ్యక్తి తనకు తానుగా రౌడీ గా చిత్రీకరించుకొని రౌడీ గ్యాంగుల పేరుతో చలామణి అవుతూ, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో భయభ్రాంతులకు గురిచేసే విధంగా పోస్టులు పెడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న వ్యక్తిని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ప్రస్తుతం ఖమ్మం బస్ డిపో నివాసం ఉంటున్న మురళి కృష్ణ ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని రౌడీయిజాన్ని ప్రదర్శించడం, ప్రజలను భయపెట్టేలా పోస్టులు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ హెచ్చరించారు.

సగరుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలి



- **కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలి**
- **జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్**

వనపర్తి,నవంబర్14(తెలంగాణ ముచ్చట్లు): సగరులను బీసీడీ నుంచి బీసీ ఏ కేటగిరీలోకి మార్చాలనే డిమాండ్ సాధన కోసం సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లా కేంద్రంలోని మారికుంట జిల్లా సగర కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి సగర సంఘం నాయకులు, యువజన నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సగర కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.సగరులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలనే డిమాండ్‌ను సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. సంఘటిత శక్తితో తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ధర్నాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా సగర సంఘం ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చంద్రయుడు,జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, జిల్లా ముఖ్య సలహాదారుడు పల్లె సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకా సత్యం సాగర్,రాష్ట్ర కోశాధికారి చీర్ల విష్ణు, రాష్ట్ర నాయకులు పెబ్బేరు శ్రీనివాసులు సాగర్, వనపర్తి మండల అధ్యక్షుడు చీర్ల ఆంజనేయులు సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, వనపర్తి పట్టణ అధ్యక్షుడు బుజ్జన్న, వనపర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చీర్ల శ్రీనివాసులు, సోషల్ మీడియా ఇన్‌చార్జి కొమ్ముల శ్రీనివాసులు పాల్గొన్నారు.





వార్షిక తనిఖీలో భాగంగా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

- **నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి**
- **పోలీస్ సిబ్బందికి సూచనలు**

ధర్మసాగర్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): వార్షిక తనిఖీలో భాగంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి శనివారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను, నమోదైన కేసుల వివరాలను, నేరాల రేటును క్షుణ్ణంగా పరిశీలించి పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజల్లో విస్తృత స్థాయిలో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు.అలాగే పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, బాధితులకు సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం, గౌరవం పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే పాలకులు..... విద్యార్థులే ఉపాధ్యాయులు!

- **శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో వినూత్నంగా బాలల దినోత్సవ వేడుకలు**
- **సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహణతో విద్యార్థుల్లో నాయకత్వ పటిమకు పదును**
- **వివిధ శాఖల బాధ్యతలు చేపట్టి ప్రతిభ చాటుకున్న విద్యార్థినీ విద్యార్థులు**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): నాగులవంచలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వినూత్నంగా సెల్ఫ్ గవర్నమెంట్ (విద్యార్థి స్వపరిపాలన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, అధికార పక్ష నాయకులు, ప్రతిపక్ష నాయకులు, పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, పీఈటీలు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన వివిధ బాధ్యతలను స్వీకరించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఆయా పాత్రల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వ్యవహరిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్లా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బాలల దినోత్సవం ప్రాముఖ్యతను, ప్రతి సంవత్సరం నవంబర్ 14న ఈ వేడుకలను ఎందుకు జరుపుకుంటామనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తామని, పిల్లలంటే నెహ్రూకు ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని తెలిపారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులు పాఠశాల విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, పరస్పర సహకారం వంటి జీవితానికి అవసరమైన మెలకువలను అలవర్చుకోవాలని సూచించారు. సెల్ఫ్ గవర్నమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ సామర్థ్యాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు భవిష్యత్తులో సమాజానికి బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి మార్గదర్శకంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు ఇనుకుల్లా దివాకర్ రెడ్డి, వాహిని, సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణ : విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, నాయకులుగా బాధ్యతలు చేపట్టి పాఠశాల నిర్వహణను అనుభవించడం ఈ బాలల దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ నెల 22న ఘనంగా కరీంనగర్ సదర్ సమ్మేళనం

- **సదర్ ఉత్సవాలకు రావాలని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుకు ఆహ్వానం**

కరీంనగర్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ సదర్ కమిటీ, ఆల్ ఇండియా మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం సాయంత్రం నగరంలోని సర్కస్ గ్రౌండ్ (జ్యోతిబా పూలే మైదానం)లో సదర్ సమ్మేళన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావును సదర్ ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా భగత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో సదర్ ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి, వేడుకల నిర్వహణకు సంబంధించిన విశేషాలను వివరించారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

దీనిపై యాదగిరి సునీల్ రావు సానుకూలంగా స్పందిస్తూ, సదర్ ఉత్సవాల విజయవంతానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సదర్ ఉత్సవ కమిటీ సభ్యులు సందబోయిన రవి యాదవ్, సందబోయిన ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా

- **జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్**
- **ధర్నా కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రండి**
- **టి యు డబ్ల్యూ జే టీజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి పిలుపు**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని, ఎన్నికలలో ఇచ్చిన జర్నలిస్టుల స్థలాల హామీని అమలు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్) జిల్లా కమిటీ సమావేశం ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులు అనేక సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వాలు ఎన్ని మారిన కూడా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయని ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఈనెల 16న సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, మందుల ఉపేందర్, ప్రశాంత్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు మూల జీవన్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు ఉత్కంఠం శ్రీను, కళ్యాణ్, మోహన్, సాయి, తిరుపతిరావు, యాదగిరి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, ఎన్టీవీ సాయి,నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, నర సింహారావు, కూరపాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 15 - నవంబర్ 2026
వరంగల్ 05

ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): వార్షిక తనిఖీలలో భాగంగా ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, పెండింగ్ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐలు ముష్కరాజు, మురళి, సాగర్, సంజీవ్, డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం బ్యూరో, నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. తొలుత ఉదయం 11:30 గంటలకు కూసుమంచి మండలంలోని నేలపట్ల గ్రామంలో శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి పోతురాజు దేవాలయ విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరావుతారు. ఆ తర్వాత ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో, ఖమ్మం నగరంలో పలు శుభ కార్యక్రమాలకు వెళతారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో, సాయంత్రం 4:40 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో చేయూత పథకం కింద లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. రాత్రి 8:20 గంటలకు ఖమ్మంలోని ఎస్సార్ కన్వెన్షన్ లో ఓ వివాహ వేడుకకు హాజరవుతారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.




వార్షిక తనిఖీలో వేలేరు పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించిన కాజీపేట ఏసీపీ

వేలేరు, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): ఈరోజు వార్షిక తనిఖీలో భాగంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వేలేరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను, నమోదైన కేసుల వివరాలను, క్రైమ్ రేటును క్షుణ్ణంగా పరిశీలించి స్టేషన్ పనితీరును సమీక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎస్ఐతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి అక్రమ రవాణా, వినియోగం, సైబర్ నేరాలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.
ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఏసీపీ సూచించారు.

విజయలక్ష్మి దశదిన పెద్దకర్మకు హాజరై నివాళులర్పించిన సుడా చైర్మన్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం నగరంలోని ఓయాసిస్ రిసార్టన్‌లో శనివారం నిర్వహించిన మోతుపూరి విజయలక్ష్మి గారి దశదిన పెద్దకర్మ కార్యక్రమానికి సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు కిలారి అనిల్, పందిరాజు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలు

- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



వనపర్తి,నవంబర్14(తెలంగాణముచ్చట్లు):- నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలని, విద్యార్థుల్లో దాగి ఉన్నప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తి పట్టణంలోని వల్లభ నగర్‌లో గల రేడియంట్ స్కూల్ బ్రాంచ్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవడంతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, సంస్కృతిపై ఆసక్తి పెంపొందించుకోవాలని అన్నారు. దేశానికి సేవ చేసే గొప్ప పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడంతో పాటు పెద్దలను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. పిల్లలలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు సమానంగా కృషి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దేశీ రాములు, ముజుభా, మద్దిలేటి, మైత్రి, శైలజ, నరేష్, రమేష్, రాజేంద్ర ప్రసాద్ చారి, స్వప్న, హేమలత, పుష్పలత, కళ్యాణి, జహంగీర్‌తో పాటు పాఠశాల యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.దీంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. చివరగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అతిథులకు, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ కిడ్జ్ లో ఆనందోత్సవాలతో బాలల దినోత్సవం



- **పలు రకాల పోటీలలో సృజనాత్మకతను చాటిన చిన్నారులు.**



ఖమ్మం బ్యూరో,నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం జాతీయ బాలల దినోత్సవం ఆనందోత్సాహాలతో నిర్వహించారు.తొలుత చాచా నెహ్రూ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి నిర్వహించిన ఈ పోటీలలో చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటలు పోటీలు, చెస్ పోటీలలో తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో చిన్నారులు పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. అనంతరం వివిధ పోటీలలో విజయం సాధించిన పాఠశాల విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ నవంబర్ 14 బాలలందరికి గొప్ప పండుగ అని, విద్యార్థుల సృజనను వెలికి తీయడానికి బాలల దినోత్సవం దోహద పడుతుందని తెలిపారు. స్వతంత్ర్య భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, పిల్లలను గులాబీ పూలు లాగా భావించి వారి సున్నిత మనసులు వికసించేలా పిల్లల దినోత్సవం ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. మహనీయుల జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనపు సుకన్య ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

గురువుల స్థానంలో శిష్యులు.. ఆల్టిట్యూడ్ పాఠశాలలో బాలల దినోత్సవ సంబరాలు!



ఎల్కతుర్తి నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల స్థానాల్లో నిలబడి తరగతి గదుల్లో పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయులుగా మారిన చిన్నారులు పాఠాలు చెప్పడంతో పాటు పాటలు పాడుతూ, వివిధ అంశాలపై ప్రసంగిస్తూ తమలోని ప్రతిభను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల బాధ్యతలు, విద్యార్థులకు విద్యాబోధన చేయడంలో వారు పడే కష్టాలు, ఎదుర్కొనే సవాళ్ల గురించి చక్కగా వివరించారు. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడిన తర్వాత వారి బాధ్యత ఎంత గొప్పదో స్వయంగా అనుభవించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. పిల్లలంటే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఎంతో ఇష్టమని, వారి భవిష్యత్తు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందుతాయని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి ఉత్తమ ఉపాధ్యాయులుగా, ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పాత్రను పోషించిన విద్యార్థులు కొత్త అనుభూతిని పొందగా, బాలల దినోత్సవ వేడుకలు పాఠశాలలో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపాల్ లింగ మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, సరిత, లావణ్య, సురేష్, ఆశా బేగం, లలిత, సుమలత, రమేష్, కవిత, కావ్య, స్వప్న, కృష్ణ, కళ్యాణి, రమ్య పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

- **బాలికలకు త్వరలో సైకిళ్లు, విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తాం**
- **సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**



పెద్దమందడి,నవంబర్14(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బాలల సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు చిన్న వయసులో బాల్యవివాహాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించాలని, చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏ సమస్యలు ఉన్నా గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని, వారి అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పాఠశాలలో 8, 9, 10వ తరగతులు చదువుతున్న బాలికలకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో సైకిళ్లు అందజేస్తామని, విద్యార్థులు ఆటలు ఆడేందుకు టెన్నిస్, వాలీబాల్ క్రీడా సామగ్రిని కూడా అందిస్తామని వెల్లడించారు.పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసులో బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజంలో జరిగే చెడును ప్రశ్నించాలని తెలిపారు.
ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ మాట్లాడుతూ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రామ్ రెడ్డి, వార్డు సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు బాలరాజు, ప్రేమ్ కుమార్ రెడ్డి, మహిళా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

మొండి వర్రె నిర్వాసితులకు అండగా ఉంటా.!

- **భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతా.**
- **సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానన్న తుమ్మల.**



దమ్మపేట, నవంబరు 14 (తెలంగాణ ముచ్చట్లు): సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. దమ్మపేట మండల పరిధిలోని మొండి వర్రె గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు శనివారం గండుగులపల్లి గ్రామంలో మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి తమ భూముల విషయంలో ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. భూ నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నిర్వాసితులకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. మంత్రి హామీతో సమస్య పరిష్కారంపై భూ నిర్వాసితుల్లో ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నెల రోజులు గడవకముందే పగుళ్లుబారిన సీసీ రోడ్డు

- **కాంట్రాక్టర్ల ధనదాహానికి నాణ్యత తాకట్టు.. మూడు నాళ్ల ముచ్చటగా రోడ్డు నిర్మాణం**
- **రూ.10 లక్షల నిధులు వృథా.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?**
- **మహాత్మా గాంధీ యువజన జనరల్ ఫండ్ పనుల్లో నాణ్యతపై అనుమానాలు**



జమ్మికుంట, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాణ్యత లేని నిర్మాణ పనులతో గ్రామాల్లో సీసీ రోడ్లు మూడు నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం లక్షలాది రూపాయల నిధులతో నిర్మిస్తున్న రహదారులు కనీసం నెల రోజులు కూడా నిలవక పోవడం ఆందోళన కలిగిస్తోంది. నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకుండా హడావుడిగా పనులు చేపడుతుండటంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహాత్మా గాంధీ యువజన జనరల్ ఫండ్ నిధులతో చేపడుతున్న పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమ్మికుంట మండలం నగురం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. పదికాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు నెల రోజులు కూడా గడవకముందే పగుళ్లుబారింది. రోడ్డుపై సిమెంట్ పొర ఊడిపోతూ, సిమెంట్ పొడిలా రాలిపోతుండటంతో నిర్మాణ నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్డు ఇంత త్వరగా దెబ్బతినడం కాంట్రాక్టర్ల పనితీరుకు అద్దం పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే రోడ్డు పగుళ్లుబారడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రతకు పగుళ్లు మరింత విస్తరించి,రోడ్డు బీటలువారి గుంతలమయంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.ఈ ఒక్క రోడ్డుకే పరిమితం కాకుండా జిల్లాలోని పలు గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం, నాణ్యత లేని నిర్మాణ సామగ్రి వినియోగిస్తున్నా పట్టించుకోకపోవడం వల్లే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.సంబంధిత అధికారులు నగురం గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్డును తిరిగి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మూడు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై విమర్శలు

- **ఇళ్ల మంజూరుకు డబ్బులు అడుగుతున్నారంటూ ఆరోపణలు..**



జమ్మికుంట, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట మండలాల్లో ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని, నిజంగా ఇళ్లు లేని నిరుపేదలు మాత్రం ఇళ్ల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇదిలా ఉండగా, ఇళ్లు లేని అర్హులైన పేదల నుంచి ఇళ్ల మంజూరు కోసం కొందరు డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకం ఉద్దేశమే దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి మళ్లీ ఇళ్లు ఎలా మంజూరవుతున్నాయి? అర్హులైన నిరుపేదలను గుర్తించడంలో అధికారుల ప్రమాణాలు ఏమిటి? డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలపై ఎందుకు విచారణ జరగడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏ ఒక్క అధికారికి, నాయకుడికి, ప్రజాప్రతినిధికి కూడా ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పలుమార్లు స్పష్టం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇలాంటి ఆరోపణలు వినిపించడం చర్చనీయాంశంగా మారింది.
ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మూడు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి మంజూరైన ఇళ్ల వివరాలను పరిశీలించి, నిజంగా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
నిరుపేదల సొంతింటి కల నెరవేరినప్పుడే ఇందిరమ్మ ఇళ్ల పథకం అసలు లక్ష్యం నెరవేరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందుతాయా? లేక వారి ఆశలు నిరాశలుగానే మిగిలిపోతాయా? అన్నది అధికారుల విచారణ, చర్యలపై ఆధారపడి ఉంది.

15 ఏళ్ల నిరీక్షణకు ఫలితం.. రఫీకి రోబోటిక్ చేయి అందించిన ఎమ్మెల్యే



- **ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4.50 లక్షల ఎల్ఓసీ మంజూరు.**
- **బాధితుడి ఇంటికి వెళ్లి రోబోటిక్ చేయి అమర్చించిన జారె ఆదినారాయణ.**

దమ్మపేట, నవంబరు 14 (తెలంగాణ ముచ్చట్లు): ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని చాటుకున్నారు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ. దమ్మపేట మండలం తొట్టిపంపు పంచాయతీ పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ 15 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కుడి చేతిని కోల్పోయారు. అప్పటి నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ఆయనకు అండగా నిలిచారు. రఫీకి రోబోటిక్ చేయి అమర్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4.50 లక్షల విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించారు. నిమ్స్ ఆసుపత్రి ద్వారా రోబోటిక్ చేయి ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రఫీ నివాసానికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తన చేతుల మీదుగా రోబోటిక్ చేతిని అమర్చించారు. 15 ఏళ్లుగా ఒక చేతి లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రఫీకి ఈ సహాయం కొత్త ఆశను కల్పించింది. బాధితుడి పరిస్థితిని గుర్తించి, ప్రభుత్వ సహాయాన్ని అందించడమే కాకుండా స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి చేయూత అందించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్హులకు ప్రభుత్వ సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా రెండోసారి కనపర్తి కుమారి



- **నియామక పత్రం అందజేత.. అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.**

సత్తుపల్లి, నవంబరు 14 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా సత్తుపల్లికి చెందిన కనపర్తి కుమారి రెండోసారి నియమితులయ్యారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఆమె అందించిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించింది. ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో కనపర్తి కుమారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కనపర్తి కుమారి మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి తనకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా రెండోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ.. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహకారంతో పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు



- **తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కోశాధికారిగా కానిగంటి శ్రీనివాస్**
- **సగర కుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తా.. రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు**

హుజురాబాద్,నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కోశాధికారిగా హుజురాబాద్ మండలం కనుకులగిద్ద గ్రామానికి చెందిన కానిగంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. రాష్ట్ర సగర సంఘం కార్యవర్గం ఆమోదించిన తీర్మానం మేరకు ఆయనను రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర అధికారికంగా ప్రకటించారు. ఈ నియామకంతో హుజురాబాద్ ప్రాంతానికి చెందిన నాయకుడికి రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల సగర సంఘం నాయకులు, కుల బాంధవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
కానిగంటి శ్రీనివాస్ గత అనేక సంవత్సరాలుగా సగర కుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. సంఘం అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. గతంలో కరీంనగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించి సంఘం బలోపేతానికి విశేష సేవలందించారు. ఆయన అనుభవం, సేవా దృక్పథం, సంఘం పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర కోశాధికారిగా కీలక బాధ్యతలు అప్పగించింది.

ఇమ్మడి రంగారావు మృతిపట్ల పలువురి సంతాపం.!

- **ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ద్వారా విశేష సేవలు.**
- **భౌతికకాయానికి ప్రముఖులు, వైద్యులు, ప్రజాప్రతినిధుల నివాళులు.**



సత్తుపల్లి, నవంబరు14 (తెలంగాణ ముచ్చట్లు): పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఇమ్మడి ప్రసాద్ తండ్రి ఇమ్మడి రంగారావు (91) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. రంగారావు భౌతికకాయాన్ని సందర్శించిన పట్టణ ప్రముఖులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ద్వారా రంగారావు అనేక మందికి వివిధ రూపాల్లో సేవలందించారని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను కొనియాడుతూ, మృతి పట్టణానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కొత్తూరు ప్రభాకర్‌రావు, పి.ఎల్. ప్రసాద్, కొత్తూరు ఉమ, మల్లూరు అంకమరాజు, డాక్టర్ రంగారావు, విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, రంగారావు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ బాధ్యులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఇల్లందకుంట బీసీ సంఘానికి నూతన సారథ్యం



- **ఇల్లందకుంట మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బండి రాజు ఎన్నిక**

ఇల్లందకుంట, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఇల్లందకుంట మండల నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేసింది. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.
తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఇల్లందకుంట మండల అధ్యక్షుడిగా బండి రాజు ఎన్నికయ్యారు. యువజన మండల ఉపాధ్యక్షుడిగా గుర్రం రమేష్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా మురహరి రాజు, బీసీ మహిళా సంఘం మండల అధ్యక్షురాలిగా గొడుగు మానస ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ నియామక పత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ బీసీ వర్గాల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన అవకాశాలు, సముచిత ప్రాధాన్యత కల్పించేలా సంఘం నిరంతరం కృషి చేయాలని సూచించారు. మండలంలోని అన్ని బీసీ కుల సంఘాలను సమన్వయం చేసుకుంటూ గ్రామగ్రామాన సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన నాయకులకు దిశానిర్దేశం చేశారు.
నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తామని, బీసీ సమాజాన్ని ఐక్యంగా ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగు సంపత్ గౌడ్, రాసిమల్ల రాజు, మోటం వెంకటేష్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్, మోత్కూరి శ్రీనివాస్ తదితరులతో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 15 - నవంబర్ 2026

తీన్మార్ మల్లన్న పాదయాత్ర ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి.. ప్రభుత్వం అండగా నిలవాలి**

హుజూరాబాద్,నవంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార పాదయాత్ర సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ హుజూరాబాద్ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున డిమాండ్ చేశారు.

పాదయాత్ర సందర్భంగా జరిగిన ఈ ప్రమాదంలో పలువురు గాయపడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ ఘటన సాధారణ రోడ్డు ప్రమాదమా? లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కుట్రపూరితంగా వ్యవహరించారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని, అయితే పోలీసుల సమగ్ర దర్యాప్తు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు.

ఒకవేళ ఈ ప్రమాదం వెనుక ఎవరిదైనా ఉద్దేశపూర్వక ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో సాగుతున్న ఉద్యమాలను భయపెట్టాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు.



బహుజన సమాజం సహనాన్ని బలహీనతగా భావించవద్దని, బహుజనుల ఐక్యతను ఎవరూ తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించారు. ప్రజల ఆగ్రహానికి కారణమయ్యే చర్యలకు పాల్పడే వారు చట్టం ముందు సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, పూర్తి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బీసీ రాజ్యాధికార పాదయాత్రకు తగిన పోలీసు భద్రత కల్పించాలని తిరగమల్ల నాగార్జున కోరారు.

మా పోరాటం ప్రజాస్వామ్యబద్ధమైనదని, హింసకు తావులేకుండా ఐక్యత, చట్టబద్ధమైన పోరాటం, రాజ్యాంగబద్ధమైన ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన కోసం ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

చదువు ఉంటేనే భవిష్యత్తుకు భరోసా!

- **పేదరికాన్ని జయించే ఆయుధం విద్య..**
- **సమాజాన్ని మార్చే శక్తి విద్య!**

విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించడానికి ఉపయోగపడే సాధనం మాత్రమే కాదు. మనిషికి ఆలోచించే శక్తిని, ప్రశ్నించే ధైర్యాన్ని, సమాజంలో గౌరవంగా జీవించే ఆత్మవిశ్వాసాన్ని అందించే గొప్ప ఆయుధం. ఒక కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండవచ్చు. కానీ ఆ కుటుంబంలోని పిల్లలకు నాణ్యమైన విద్య అందితే వారి జీవితాల్లో కొత్త వెలుగులు నిండే అవకాశం ఉంటుంది.డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ప్రసిద్ధ పిలుపు “చదువుకోండి, సమీకరించండి, పోరాడండి” (Educate, Agitate, Organize) నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. విద్య ద్వారానే అణగారిన వర్గాలు తమ హక్కులను తెలుసుకొని, ఆత్మగౌరవంతో ముందుకు సాగగలవని ఆయన జీవితం మనకు తెలియజేస్తుంది. ఒకప్పుడు ఎన్నో సామాజిక అడ్డంకులను ఎదుర్కొన్న అంబేడ్కర్ ఉన్నత విద్యను అభ్యసించి దేశ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రయాణం ప్రతి పేద విద్యార్థికి ఒక సందేశం. పరిస్థితులు ఎలా ఉన్నా చదువును వదులుకోకూడదు. మధ్యతరగతి, పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంటారు. తమ అవసరాలను తగ్గించుకొని, అప్పులు చేసి అయినా పిల్లలను పాఠశాలకు పంపిస్తారు. తల్లి తన కష్టాలను బయటకు చెప్పకపోవచ్చు. తండ్రి తన బాధలను మనసులోనే దాచుకోవచ్చు. కానీ వారి ఆశ ఒక్కటే,తమ పిల్లలు తమకంటే మెరుగైన జీవితాన్ని పొందాలి.అలాంటి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించడం ప్రతి విద్యార్థి బాధ్యత. చదువును నిర్లక్ష్యం చేయకుండా, సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని సాధించాలి.

ఆడపిల్లల విద్య..
సమాజ అభివృద్ధికి పునాది

సావిత్రిబాయి ఫూలే మహిళా విద్య కోసం ఎన్నో అవమానాలను, అడ్డంకులను ఎదుర్కొని పోరాడారు. బాలికలకు విద్య అందించడంలో ఆమె చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. ఒక ఆడపిల్ల చదువుకుంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక కుటుంబం, తద్వారా సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది.ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు, బాల్యవివాహాలు, కుటుంబ పరిస్థితుల కారణంగా బాలికల చదువుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలి. అబ్బాయిలకు ఇచ్చే అవకాశాలే అమ్మాయిలకూ అందాలి. ప్రతి తల్లిదండ్రి తమ కుమార్తెల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి.

మార్కులే కాదు..
మానవత్వం కూడా ముఖ్యం

విద్య అంటే కేవలం పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కాదు. మంచి చెడులను గుర్తించడం, ఇతరులను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం కూడా విద్యలో భాగమే. డిగ్రీలు సంపాదించినా మానవత్వం లేకపోతే ఆ విద్యకు పరిపూర్ణత ఉండదు.ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను నేర్పించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువును కేవలం మార్కులతో అంచనా వేయకుండా వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలి.

నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు

ప్రభుత్వాలు విద్యారంగంలో మరిన్ని అవకాశాలు కల్పించాలి. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నాణ్యమైన పాఠశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ విద్య అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పట్టణ విద్యార్థులతో సమానమైన అవకాశాలు కల్పించాలి.చివరగా ప్రతి విద్యార్థి ఒక విషయం గుర్తుంచుకోవాలి. పేదరికం మన జన్మస్థితి కావచ్చు కానీ అది మన భవిష్యత్తును నిర్ణయించకూడదు. కష్టపడి చదివితే అవకాశాలను సృష్టించుకోవచ్చు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చవచ్చు. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగవచ్చు.విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాదు, తరతరాల భవిష్యత్తును మార్చగల శక్తి. అందుకే ప్రతి ఇంట్లో చదువు వెలగాలి. ప్రతి బిడ్డకు విద్య అందాలి. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కలగాలి. “విద్యతోనే వ్యక్తికి జ్ఞానం.. జ్ఞానంతోనే సమాజానికి మార్పు.. ఆ మార్పుతోనే దేశానికి అభివృద్ధి.”



-హన్మకొండ శ్రీకాంత్...

చిన్నారుల దినోత్సవ వేడుకలకు వేదికగా మారిన తమ్మిడికుంట

- **ఆటపాటలతో సందడి చేసిన 270 మంది విద్యార్థులు**
- **ప్లే ఏరియాలు, ఓపెన్ జిమ్‌లలో చిన్నారుల కేరింతలు**



హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): హైడ్రా ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసిన తమ్మిడికుంట చెరువు బాలల దినోత్సవ వేడుకలకు ప్రత్యేక వేదికగా నిలిచింది. సాధారణంగా పాఠశాలల్లో గడిపే విద్యార్థులు శనివారం పుస్తకాలను పక్కనపెట్టి ప్రకృతి ఒడిలో ఆటపాటలతో సందడి చేశారు. బాలానగర్‌లోని వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 270 మంది చిన్నారులు తమ్మిడికుంటకు చేరుకుని బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఆట స్థలాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు చిన్నారులను ఆకట్టుకున్నాయి. పిల్లల కేరింతలతో తమ్మిడికుంట పరిసరాలు సందడిగా మారాయి. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన చెరువు ప్రాంతం నేడు చిన్నారులు, కుటుంబాలు సేదతీరే ఆహ్లాదకరమైన ప్రదేశంగా మారడం ఈ వేడుకలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది.

తమ్మిడికుంటలో ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను విద్యార్థులు ఆసక్తిగా సందర్శించారు. చెరువు ప్రాంగణంలోని ప్లే ఏరియాలో ఆటలాడుతూ, ఓపెన్ జిమ్‌లో వ్యాయామ పరికరాలను ఉపయోగిస్తూ ఆనందంగా గడిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పార్కుల్లో తిరుగుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. చెరువు కట్టపై ఏర్పాటు చేసిన నడక మార్గంలో విద్యార్థులు నడిచారు. గజీబోలో బోన్సాయ్ మొక్క సమీపంలో కూర్చొని అక్కడి వాతావరణాన్ని ఆస్వాదించారు. చెరువు పరిసరాల్లో పచ్చదనం, పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా కల్పించిన సదుపాయాలు వారిని ఆకట్టుకున్నాయి. రోజువారీ తరగతి గది వాతావరణానికి భిన్నంగా ప్రకృతి మధ్య గడిపే అవకాశం రావడంతో చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

తమ్మిడికుంట పునరుద్ధరణకు ముందు పరిస్థితి ఎలా ఉండేది, అభివృద్ధి పనులు చేపట్టిన సమయంలో ఎలాంటి మార్పులు జరిగాయి, ప్రస్తుతం చెరువు ఎలా రూపుదిద్దుకుందనే వివరాలతో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. గతంలో చెరువు పరిసరాలు ఎదుర్కొన్న పరిస్థితులను, అభివృద్ధి తర్వాత వచ్చిన మార్పులను చిత్రాల ద్వారా తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 11న తమ్మిడికుంటను ప్రారంభించగా, ఆ తర్వాత చెరువును సందర్శించిన అతిథులుగా చిన్నారులు నిలిచారు. చెరువు అభివృద్ధికి సంబంధించిన వివరాలను తెలుసుకుంటూ, పునరుద్ధరణ పనుల వెనుక ఉన్న కృషిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు.కేవలం ఆటపాటలకే పరిమితం కాకుండా చెరువుల పరిరక్షణ, పర్యావరణ ప్రాధాన్యంపై అవగాహన పొందేలా ఈ సందర్శన సాగింది.

తమ్మిడికుంట అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించిన విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ డైరెక్టర్ యూనస్ పర్వేజ్ విద్యార్థులకు చెరువు పునరుద్ధరణ తీరును వివరించారు. అభివృద్ధి పనులు చేపట్టడానికి ముందు ఉన్న పరిస్థితులు, చెరువు రూపురేఖల్లో తీసుకొచ్చిన మార్పులు, సందర్శకుల కోసం కల్పించిన సదుపాయాల గురించి తెలియజేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని చిన్నారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని చెప్పారు. చెరువులు,నీటి వనరుల పరిరక్షణ భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని వివరించారు. చిన్న వయసు నుంచే పర్యావరణంపై బాధ్యతాయుతమైన ఆలోచనలు అలవర్చుకోవాలని సూచించారు.

తమ్మిడికుంటలో కల్పించిన సౌకర్యాలపై వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పటికీ చెరువు పరిసరాల్లోని వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. పిల్లలు విశ్రాంతి తీసుకునేందుకు గజీబోలు, ఆటలాడేందుకు ప్లే ఏరియాలు, వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో ఈ ప్రాంతంలో దుర్గంధం కారణంగా ఎవరూ రాలేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పూర్తిగా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని గుర్తుచేశారు. చెరువుల పునరుద్ధరణతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. తమ్మిడికుంటను ఇంతలా అభివృద్ధి చేసిన హైడ్రాకు ధన్యవాదాలు తెలుపుతూ, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు వెల్లడించారు.

ఘనంగా ఆకినపల్లి శిరీష జన్మదిన వేడుకలు



- **శిరీష దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

హుజూరాబాద్,నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): బీసీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఆకినపల్లి శిరీష జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని ఆమె స్వగృహంలో జరిగిన ఈ వేడుకలకు బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆకినపల్లి శిరీషకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ ఆకినపల్లి శిరీష జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమెతో పాటు భర్త ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ దారి విషయంలో వివాదం.. మహిళపై దాడి!

వేలేరు, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): ఫిర్యాదు వివరాల ప్రకారం.. భానోత్ వసంత 2003లో ఎర్రబెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 51/Bలో 2 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమికి వెళ్లేందుకు పక్కనే ఉన్న లవుడ్య మంగమ్మ భూమి మీదుగా దారిని ఏర్పాటు చేసుకొని సుమారు 20 ఏళ్లుగా వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు.

అయితే ఇటీవల లవుడ్య మంగమ్మ సదరు దారిని ఆక్రమించి దున్నడంతో పాటు రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తున్నట్లు వసంత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 31న ఉదయం 11:30 గంటల సమయంలో లవుడ్య మంగమ్మ, ఆమె అల్లుడు మాలోత్ సమ్మయ్య, ధరావత్ రాజ్ కుమార్ కూలీలు, ట్రాక్టర్ల సహాయంతో దారిపై పోయించిన మొరాన్ని తొలగించేందుకు ప్రయత్నించారని తెలిపారు. దీనిని అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మానవీయ విలువలు, సమానత్వంతోనే న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం

- **ఆర్థిక వృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందాలి**
- **మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్-2026లో ‘తెలంగాణ రైజింగ్ - సంస్కృతి, సమాజం’ అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలు, మానవీయ విలువల ప్రాధాన్యం, సంస్కృతి ద్వారా సామాజిక మార్పు తీసుకురావాల్సిన అవసరం, సమానత్వంతో కూడిన అభివృద్ధి వంటి అంశాలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. శతాబ్దాలుగా మానవ సమాజం అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ప్రపంచంలోని పలు దేశాల్లో ఇప్పటికీ హింస, ఘర్షణలు, అసమానతలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మానవీయ విలువలకు విరుద్ధంగా జరుగుతున్న పరిణామాలు సమాజం ముందున్న సవాళ్లను స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందడం మాత్రమే సమాజ పురోగతికి కొలమానం కాదని, ప్రజల మధ్య పరస్పర గౌరవం, సహనం, సామాజిక బాధ్యత, మానవత్వం కూడా అంతే ముఖ్యమని వివరించారు. ఆర్థిక వృద్ధి ఫలాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాల్సిన అవసరం ఉందని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులు, యువత, కార్మికులు, బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే సమాజంలో సమాన అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. అభివృద్ధి అనేది కొంతమంది ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లోనూ మార్పు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. శాంతియుత సహజీవనం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, వీటికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గడంతో పాటు ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనం సాగించే అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి ప్రక్రియలో ఏ ఒక్క వర్గమూ వెనుకబడిపోకుండా చూడటం సమాజం, ప్రభుత్వాల బాధ్యతగా ఉండాలని వివరించారు.



సంస్కృతి అంటే కేవలం కళలు, నృత్యాలు, సంగీతం, పండుగలు మాత్రమే కాదని, అది ప్రజల మొత్తం జీవన విధానానికి ప్రతిబింబమని మంత్రి వివరించారు. ప్రజల ఆలోచనా ధోరణులు, విశ్వాసాలు, సంప్రదాయాలు, సామాజిక ప్రవర్తనలు, పరస్పర సంబంధాలు కలగలిపిన సమాహారమే సంస్కృతి అని తెలిపారు. ఒక సమాజం ఎలా ఆలోచిస్తుంది, ఇతరులతో ఎలా వ్యవహరిస్తుంది, తన సంప్రదాయాలను ఎలా కొనసాగిస్తుంది అనే అంశాలు ఆ సమాజపు సాంస్కృతిక స్వరూపాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. కాలానుగుణంగా సమాజంలో మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, పరస్పర గౌరవం వంటి అంశాలకు ప్రాధాన్యం తగ్గకూడదన్నారు.


తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

రైతు కష్టాన్ని పలకరించి..

హమాలీ భారాన్ని భుజానికెత్తుకున్న ఖాకీ!







- వడ్ల బస్తాను స్వయంగా మోసిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి
- రైతు పంటపై ఆరా...హమాలీల కష్టాల్లో భాగస్వామ్యం
- తలపాగా ధరించి స్వయంగా వీపుపై వడ్ల బస్తా మోసి ట్రాక్టర్‌లో ఎక్కించిన ఏసీపీ
- హోదాను పక్కనపెట్టి కష్టజీవులతో మమేకమైన పోలీసు అధికారి తీరుపై ప్రశంసల జల్లు

ధర్మసాగర్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):

ఒక అధికారి గొప్పతనం ఆయన కూర్చున్న కుర్చీలోనో.. ధరించిన యూనిఫాంలోనో ఉండదు. సామాన్యుడి కష్టాన్ని ఎంతగా అర్థం చేసుకుంటారో.. అవసరమైనప్పుడు వారి మధ్యకు వెళ్లి ఎంతగా మమేకమవుతారో అందులోనే ఉంటుంది. ఖాకీ యూనిఫాం వెనుక కూడా ఓ మానవీయ హృదయం ఉంటుందని తన చేతలతో చాటిచెప్పారు ఖాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి.

విధి నిర్వహణలో భాగంగా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ కోసం వెళ్తున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డికి మార్గమధ్యంలో ఓ దృశ్యం కనిపించింది. రహదారి పక్కన ధాన్యం రాశులుగా పోసి ఉండగా, మరోవైపు హమాలీలు వడ్ల బస్తాలను ట్రాక్టర్‌లోకి ఎక్కించే పనిలో నిమగ్నమయ్యారు. ఎండలో చెమటోడ్చుతూ బస్తాలను మోస్తున్న వారి శ్రమను గమనించిన ఆయన.. తన ప్రయాణాన్ని కాసేపు ఆపారు. వాహనం దిగి నేరుగా వారి వద్దకు వెళ్లారు.

రైతు పంటపై ఆసక్తి.. కష్టజీవుల జీవనంపై ఆరా!

ముందుగా అక్కడున్న రైతుతో ఆప్యాయంగా మాట్లాడారు. ఏ రకం వడ్లు పండించారు? పంట దిగుబడి ఎలా వచ్చింది? అంటూ పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ ఆయనతో ముచ్చటించారు. అనంతరం బస్తాలను మోస్తున్న హమాలీల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎన్నో బస్తాలను భుజాలపై మోస్తూ జీవనాన్ని సాగించే కార్మికుల శ్రమను దగ్గరగా గమనించిన ఆయన.. వారి కష్టాన్ని కేవలం మాటల్లోనే అభినందించలేదు. తాను కూడా ఆ పనిలో భాగస్వామి కావాలని నిర్ణయించుకున్నారు.

తలపాగా కట్టి.. వీపుపై వడ్ల బస్తా!

అంతే.. తన పోలీసు హోదాను పక్కన పెట్టి, హమాలీల మాదిరిగా తలపాగా ధరించారు. వారి సహకారంతో భారీ వడ్ల బస్తాను తన వీపుపైకి ఎత్తుకున్నారు. బస్తా బరువును భరిస్తూ, ట్రాక్టర్‌పైకి ఏర్పాటు చేసిన పలకపై జాగ్రత్తగా అడుగులు వేస్తూ ముందుకు సాగారు. చివరకు బస్తాను ట్రాక్టర్‌లోకి చేర్చారు.

ఆ సమయంలో అక్కడున్న హమాలీలు, రైతులు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేశారు. సాధారణంగా అధికారులను తమ సమస్యలు చెప్పుకునే స్థాయిలో చూసే ప్రజలకు.. ఒక పోలీసు ఉన్నతాధికారి తమతో కలిసి బస్తా మోస్తుండటం ప్రత్యేక అనుభూతిని కలిగించింది.

ఆ బస్తాలో ధాన్యమే కాదు.. రైతు కష్టం, కార్మికుడి చెమట!

ఒక వడ్ల బస్తా వెనుక రైతు ఆరుగాలం శ్రమ ఉంటుంది. అదే బస్తా గమ్యస్థానానికి చేరే క్రమంలో హమాలీ చెమట చుక్కలు కూడా ఉంటాయి. భూమిని నమ్ముకుని పంట పండించే రైతు నుంచి, ఆ పంటను బస్తాల్లో నింపి తరలించే కార్మికుడి వరకు ప్రతి ఒక్కరి కష్టం విలువైనదే. ఈ శ్రమను గుర్తించి రైతుతో మాట్లాడటం, హమాలీలతో మమేకం కావడం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి లోని సామాజిక స్పృహకు నిదర్శనం. పోలీసు విధులు అంటే కేవలం నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాదు.. ప్రజల జీవితాలను అర్థం చేసుకోవడం, వారి కష్టాలకు స్పందించడం కూడా ప్రజాసేవలో భాగమేనని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

హోదా తాత్కాలికం.. మానవత్వం శాశ్వతం!

ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ తనిఖీకి వెళ్తున్న సమయంలో జరిగిన ఈ చిన్న సంఘటన ఇప్పుడు ప్రత్యేకంగా చర్చించుకునేలా చేసింది. విధి నిర్వహణలో ఉన్నప్పటికీ సామాన్యుల కోసం ఆగిన ఆయన.. వారి శ్రమలో భాగస్వామి కావడం ద్వారా అధికారానికి మానవత్వం తోడైతే ప్రజలకు ఎంత దగ్గరవచ్చో చూపించారు.

ఒక బస్తా మోయడం వల్ల హమాలీల కష్టాలు తీరిపోకపోవచ్చు. రైతు సమస్యలన్నీ పరిష్కారం కాకపోవచ్చు. కానీ వారి కష్టాన్ని గుర్తించి, వారితో కలిసి నిలబడిన ఆ కొద్దిసేపు మాత్రం వారికి గౌరవాన్ని, ఆత్మీయతను అందించింది.

కష్టపడే వాడికే తిని హక్కు ఉంది

బస్తాల బరువులు మోస్తూనే.. కుటుంబాల బాధ్యతల బరువులను కూడా మోసేవారే హమాలీలు. కష్టాన్ని నమ్ముకుని, ఎవరి పాట్టగొట్టకుండా, ఎవరినీ మోసం చేయకుండా బతికే శ్రమజీవులు మీరు. ప్రకృతిని, భూమిని నమ్ముకుని పంటలు పండించేది రైతులైతే.. ఆ పంటను బస్తాల రూపంలో మోసుకుంటూ గమ్యస్థానాలకు చేర్చేది హమాలీలు. తినాలన్నా, తాగాలన్నా, బతకాలన్నా ఆ అర్హత కష్టపడే మీకే ఉంది. ఎందుకంటే కష్టపడేది మీరు.. చెమటోడ్చేది మీరు.. మీ శ్రమతోనే ఈ సమాజం నడుస్తోంది. కష్టాన్ని నమ్ముకున్న మీలాంటి శ్రమజీవులే నిజమైన గౌరవానికి, అన్ని విధాలా అర్హులు. కష్టం చేయనివాడికి శ్రమ విలువ తెలియదు.. కష్టపడేవాడికే ఆ కష్టం వెనుక ఉన్న బాధ తెలుస్తుంది.

- ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

ఖాకీ యూనిఫాం వేసుకున్న చేతులు అవసరమైతే ప్రజలకు రక్షణగా నిలుస్తాయి.. అదే చేతులు కష్టజీవుల శ్రమలోనూ భాగస్వాములవుతాయి.అధికారం చూపించడానికి కాదు.. ఆప్యాయత పంచడానికి కూడా ఉపయోగపడాలి. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి చేసిన ఈ పని అందించే సందేశం ఇదే!

హర్ష టయోటా షోరూంలో నూతన కార్లను ప్రారంభించిన ఎంపీ



- చింతలకుంటలో ప్రారంభోత్సవ కార్యక్రమం
- న్యూ గ్లాంజ ఫేస్‌లిఫ్ట్ కారును ఆవిష్కరణ.. ఫార్చూనర్ డిఫెండర్ ప్లస్ వాహనం ప్రారంభం
- పాల్గొన్న బీజేపీ జిల్లా, స్థానిక నాయకులు

హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం చింతలకుంటలో ఉన్న హర్ష టయోటా షోరూంలో నూతన వాహనాలను ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. న్యూ గ్లాంజ ఫేస్‌లిఫ్ట్ కారు, ఫార్చూనర్ డిఫెండర్ ప్లస్ కార్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త వాహనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఈటల రాజేందర్ తెలిపారు.

హర్ష టయోటా షోరూంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన వాహనాల ప్రారంభోత్సవంలో భాగంగా షోరూం ప్రతినిధులతో కలిసి వారు సందడి చేశారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానికంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న నాయకులు ఒకే వేదికపై కనిపించారు. షోరూంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నూతన వాహనాలను పరిశీలించారు.

నాయకులు యాష్ పాల్, నూతి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. షోరూం సిబ్బంది అతిథులకు స్వాగతం పలికి ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేశారు. నూతన కార్ల ఆవిష్కరణ సందర్భంగా షోరూం ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, షోరూం సిబ్బందితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ నూతన వాహనాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, షోరూం ప్రతినిధులు హాజరయ్యారు.

మరో రెండు చెరువులకు హైడ్రా రక్షణ కవచం

- ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అడ్డుకట్ట
- దొమ్మరపోచంపల్లిలో గొల్లవాని కుంటకు రక్షణ




హైదరాబాద్, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): చెరువుల ఆక్రమణలను అడ్డుకునే చర్యల్లో భాగంగా హైడ్రా మరో రెండు చెరువులకు రక్షణ కల్పించింది. చెరువుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తున్న హైడ్రా అధికారులు, క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు శనివారం మరో రెండు చెరువుల భూములకు రక్షణ కల్పించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని దొమ్మరపోచంపల్లి, గాజులరామారం ప్రాంతాల్లో ఈ చర్యలు చేపట్టారు. చెరువుల భూముల్లో మట్టి పోయడం, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడం ద్వారా ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై స్పందించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భవిష్యత్తులోనూ ఆక్రమణలు జరగకుండా చెరువు భూమిగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం దొమ్మరపోచంపల్లి గ్రామంలోని 3.11 గొల్లవాని కుంటకు హైడ్రా రక్షణ కల్పించింది. ఈ చెరువులో మట్టి పోసి భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి చర్యలు చేపట్టారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. చెరువు పరిధిలోని భూమిని స్పష్టంగా గుర్తించేందుకు అక్కడ హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. చెరువు భూములను ఇతర అవసరాలకు వినియోగించకుండా అడ్డుకోవడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణ ప్రయత్నాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. ఇదే జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం, దేవేందర్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న చింతల చెరువు భూములకు కూడా హైడ్రా రక్షణ కల్పించింది. మొత్తం 27 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు భూములు ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా సర్వే నంబర్ 329లో గతంలోనే ఆక్రమణలను తొలగించినప్పటికీ, మళ్లీ అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో చెరువు భూముల పరిస్థితిపై హైడ్రా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గతంలో ఆక్రమణలను తొలగించిన ప్రాంతాల్లో తిరిగి నిర్మాణాలు చేపట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు చర్యలు ప్రారంభించారు. చింతల చెరువు భూముల్లో కొందరు వ్యక్తులు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు కూడా ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆక్రమణ ప్రయత్నాలను గుర్తించారు. చెరువుకు చెందిన 9 ఎకరాల భూమిని పరిరక్షిస్తూ ఆ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువు భూమిగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఆ భూముల్లో తిరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం లేకుండా రక్షణ చర్యలు తీసుకున్నట్లు హైడ్రా తెలిపింది. స్థానికుల ఫిర్యాదులను పరిశీలించి చెరువుల భూములను కాపాడేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. దొమ్మరపోచంపల్లిలోని గొల్లవాని కుంట, గాజులరామారంలోని చింతల చెరువుకు రక్షణ కల్పించడంతో ఈ రెండు ప్రాంతాల్లో ఆక్రమణ ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు భూముల స్వరూపాన్ని తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా వాటి పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. గతంలో ఆక్రమణలను తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ నిర్మాణాలు చేపట్టే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో హైడ్రా చేపట్టిన చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చెరువుల భూములను కాపాడేందుకు స్థానికుల నుంచి వచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటున్నట్లు హైడ్రా స్పష్టం చేసింది.

సీనియర్ సిటిజన్ కమిషన్ చీఫ్ కమిషనర్‌కు కలెక్టర్ స్వాగతం

- హనుమకొండ జిల్లాకు వచ్చిన జస్టిస్ ఈద తిరుమల దేవి
- మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్
- పూల మొక్కను అందజేసి స్వాగతం
- జిల్లా పర్యటన సందర్భంగా మర్యాదపూర్వక భేటీ

హనుమకొండ, నవంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు): సీనియర్ సిటిజన్ కమిషన్ చీఫ్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమల దేవి హనుమకొండ జిల్లాకు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన చీఫ్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

జస్టిస్ ఈద తిరుమల దేవి జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ ఆమెను కలిసి పుష్పించే మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా పలకరించి స్వాగతం తెలిపారు. సీనియర్ సిటిజన్ కమిషన్ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ తిరుమల దేవి పర్యటన సందర్భంగా ఈ భేటీ జరిగింది. జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టర్ ఆమెకు స్వాగతం పలికారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా పూల మొక్కను బహూకరించడం ఈ స్వాగత కార్యక్రమంలో భాగంగా నిలిచింది. జిల్లా పర్యటనకు వచ్చిన ఉన్నతాధికారిని కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలుసుకోవడం ద్వారా కార్యక్రమం జరిగింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించింది. అయితే పర్యటనలోని ఇతర కార్యక్రమాలు, సమావేశాలకు సంబంధించిన వివరాలను ప్రకటనలో పేర్కొనలేదు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in